# శిల్పాలలో కల్పన

'ధనిష్ఠ'

రెండేళ్ళక్రితం సంగతి. బుద్ధిపుట్టింది హఠాత్తుగా మహాబలిపురం వెళదామని. ఆలయానికిదగ్గర దైవానికి దూరం అన్న సామెతగా యీవూళ్లో యిన్నాళ్ళనించి ఉంటున్నా ఒక్కసారైనా మహాబలిపురం వెళ్ళలేదు. యాత్రల పేరుతో ఎక్కడెక్కడివాళ్లు చూసి వస్తుంటారు. ఇల్లాంటి విషయాలలో మానవప్రకృతి చాలా ఆశ్చర్యజనకంగా గోచరిస్తుంది నాకు. పైవూళ్ళనించి వచ్చినవాళ్లు మద్రాసంతా కలయజూస్తారా, నాలుగేళ్ళనించి ఉంటూ ఒక్కసారి గూడ పూర్తిగా చూడలేదు నేను. ఆగ్రాలో ఉన్నారు గదా అని రోజూ తాజ్ మహల్ చూస్తారా? చూడ్డానికి వెళ్ళినవాళ్ళు మాత్రం ఉన్నన్నాళ్ళు రోజుకోసారైనా చూస్తారు.

నలుగురు శిల్పాలని కళలనిగురించి తమతమ అనుభవాలనుగూర్చి ముచ్చటించుకుంటూంటే మాట్లాడడానికేందోరక్క చూస్తూ ఉండిపోయేవాడిని నేను. అల్లా గడిచిపోయినా మాబాగే. కాని ఎవడో మిత్రుడు "మహాబలిపురంశిల్పాలెల్లా ఉంటాయిరా?" అనేవాడు అక్కడికి నేను వాటినిగురించి సాంగోపాంగంగా తెలుసుకునిఉన్నట్టు, విధిగా తెలుసుకుని ఉండవలసినట్టూను. చూడలేదని చెప్పలేక చెప్పలేక చెప్పేవాణ్ణి. "ముప్పైమైళ్ళదూరంలో ఉండి ఒక్కసారీ వెళ్ళలేదురా?" అనేవారు నన్నో జంతువులా చూస్తూ. ఈ అవమానాల నించి తప్పించుకుందుకైనా ఒకసారి వెళ్ళితీరాలని నిశ్చయించుకున్నాను మనస్సులో. ఇంకో చిక్కుంది. నేను వెళ్ళినా వెళ్ళకపోయినా దానికి పెద్ద విలువేమీ ఉండదు. కారణం ఏమిటంటే నేను కవినికాను. చిత్రకారుణ్ణి కాదు, కనీసం కళారాధకుణ్ణైనా కాదు. అలంకారంలోను, సమాసాలలోను నేను చూసినవాటిని వర్ణించలేను. వివిధరంగులకలయికలో ఆ సుందరదృశ్యాల్ని కాన్వాస్ మీదకు గాని, కాగితంమీదకు గాని తీసుకురాలేను. కాని వెళ్లలేదని చెప్పడానికి, వెళ్ళినా దాన్ని గురించి విపులంగా చెప్పలేకపోవడానికి తేడా ఉందిగా. అదీకాక అనుభవించడానికి హృదయం ఉందిగా వర్ణించి చెప్పడానికి నోరులేకపోయినా. అంచేత ఒకసారి వెళ్ళాలనిపించుకుంటే యీ అవమానజ్వాలనించైనా తప్పించుకోవచ్చని వెళ్ళడానికి నిశ్చయించాను. నాకు ఉపగ్రహం మధుగాడొకడు. వాణ్ణి కదిపాను. 'సరే' నన్నాడు.

ఒక శనివారం సాయంత్రం ఆలోచించి ప్రోగ్రాం నిశ్చయించి వర్క్ షాప్ లో, కారు పంపించమనీ మొన్నాడు పొద్దున్నే ఆరుగంటలకి నా గదిదగ్గర ఉండాలని పురమాయించాను.

రాత్రంతా శిల్పాలనిగురించిన కలలే; ఊరికే మొదట శిల్పాలు కనబడడం తర్వాత వాటికి ప్రాణం వచ్చి చరించడం ఏమిటేమిటో యింకా చిత్రవిచిత్రాలుగా కలలొచ్చాయి. కలతనిద్రే గాని సంతృప్తిగా కంటికి కూర్కు లేదు. తెల్లారిందే తడవుగా టిప్ టాప్ గా తయారై కూర్చున్నాను. ఆరింటికి కారు ఇంటికి తీసుకువచ్చాడు వర్క్ షాప్ డ్రైవర్. వాడికో రూపాయి పారేసి పొమ్మని మధుకోసం వాడింటికెళ్ళాను.

కారులో కూర్చుని హారన్ వేశాను. ఆపాటికే తయారై హారన్ కోసం చెవులు దోరబెట్టుకుని కూర్చుని వినబడగానే పరుగెత్తుకొస్తాడనుకున్నాను. కాని ఆ జాడలేం కనబడలేదు. పైకెళ్ళిచూస్తే నిద్ర మంచం మీదనించే లేవలేదని తెలిసింది. నాకు నిలువునా కాలుకొచ్చింది. నిన్నంతా చెప్పి యిదా వీడు చేసేపని! రూములో కెళ్లి తట్టి లేపాను. మూలిగాడు. వళ్ళు వెచ్చగా ఉంది. నాకోపం దిగజారిపోయింది.

"మధూ! అల్లా ఉన్నావేమ్రా!" అన్నాను నిదానంగా.

"రాత్రి కొంచెం పులకరం తగిలిందిరా. ఇవాళ వెడదామని అన్నీ అనుకున్నామూ యిల్లా జరిగింది." అన్నాడు.

"ఛా! దానికేమిటిరా! ఇంకోరోజున వెళ్లొచ్చు. డాక్టర్ దగ్గిర కెడదాం రా." అన్నాను.

"ఈమాత్రం దానికి డాక్టరెందుకోయ్! 'లంఖణం పరమౌషధం' అని ఒక్కపూట పస్తుంటే పోతాయి ఎక్కడివక్కడ అన్నిరోగాలూను. దానికేం గాని నువ్వెళ్లు అనుకున్నది కాస్త పడకపోతే మళ్ళీమళ్ళీ అడ్డంకులు వస్తూనే ఉంటాయి."

"ఏడ్చావ్ లే. నువ్వు రాందే నేను మాత్రం ఎల్లా వెడతానూ. ఈ మాటెప్పుడైనా వెడదాంలే!"

"ఏడవలేకపోయావ్! అన్నీ ఏర్పాటుచేసుకుని మానుకోవడ మెందుకూ. ఇవాళ నాకోసం మానేస్తే యింకోరోజు యింకో అవాంతరం, రావొచ్చు. వెడదామనుకున్నావ్. అన్నీ సిద్ధంచేసుకున్నావ్. మళ్ళీ యీ అవకాశం పోగొట్టుకుంటే బోలెడు కాలయాపనౌతుంది. అందుచేత నామాట విని నువ్వెళ్లు."

"అవకాశాల కేమిట్లే ఇవాళ కాకపోతే యింకో సారి వెడతాం. అందుకని నువ్వులేకుండా వెళ్లనా?"

"ఒరేయి! మెట్టవేదాంతం కట్టిపెట్టు. నేను లేకుండా వెడితే కొంపేం మునిగిపోలేదు. నేను కూడా ఉంటే ఆశిల్పాలవైభవం ద్విగుణీకృతం కాదు. అదీ కాకుండా నేను చూడనే చూశాను, నువ్వు లేకుండానే. అందుచేత అబ్బాయ్! సుబ్బారాయిళ్లా బొబ్బలెట్టకుండా యిబ్బందిపడక నిబ్బరంగా పోయిరా." అన్నాడు నవ్వుతూ.

"మహా కష్టపడివేశావ్ లే వృత్తి. ఆమాత్రానికే స్వోత్కర్షతోకూడిన నవ్వొకటి. కాని కుదూ! నేను వెళ్లను."

"నేనేం వృత్త్యనుప్రాసంలో మాట్లాడానని నవ్వుకోవటం లేదు. నిన్ను సుబ్బారాయుడన్నానుగా వాడు జ్ఞాపకంవచ్చి వచ్చిందినవ్వు. నువ్వేదో కవిత్వం ఏడుస్తావ్ గాబట్టి, అందులో పదగాంభీర్యం కోసం అర్థంపర్థంలేనిమాటలలో గారడీ చేయాలనుకుంటావు గనకా నీకూ ఆబాధ. నాకేం! దానికేం గాని మొండిపట్టుపట్టి, అంతా సిద్ధంచేసుకుని కూడ అధ్వాన్నంకానీకు. కావలిస్తే యింకోమాటు యిద్దరం కలిసి వెడదాంలే." అంటూ బలవంతపెట్టి వప్పించాడు.

అప్పుడు వెళ్లడమే నయమైంది. నాటినుంచి నేటివరకు నేనూ మధుగాడు కలిసి అధమం పదిసార్లేనా ప్రయత్నించాం వెడదామని. పడలేదు. కాని ఇప్పుడు చిత్రంగా ఒక ఊహవస్తూ ఉంటుంది. ఆనాడు మొండిగా వెళ్ళడం మానేస్తే నాజీవితగ్రహంయొక్క పథం యింకోలా ఉండేదేమో. మానవజీవితంలో పరాకాష్ఠకు జీవనప్రవాహపు బడిదుడుకుల సుడిగుండానికి కేవలం ఒక్క సంఘటనే ఆధారం కావడం. చాలాచోట్ల సంభవిస్తుంది. ఒక్కొక్క సంఘటన ఆక్షణంలో అల్లా జరగకపోతే జీవితకక్ష్యలో ఎల్లాంటిపరిణామాలుంటాయో ననిపిస్తుంది. ఆ సంఘటన అట్లా జరగకపోయినా యిదేఫలితం పొందడం వేరుమార్గాల ద్వారా సంభవించడానికి అవకాశాలున్నాయి అని వాదనకోసం అనవచ్చునేమో కాని వాస్తవంగా జరగదేమో నని నా అనుమానం. ఏమైతేనేం అవాళ మధుగాడిబలవంతంవల్ల వెళ్లిక తప్పిందికాదు.

బంకుకు వెళ్లి పెట్రోల్ పోయించుకుని ఒక్కణ్ణే బయలుదేరాను. హోటల్లో స్వీట్స్ పాక్ చేయించి ఫ్లాస్క్ నిండా కాఫీ పోయించాను.

ఒక్కణ్ణే బయలుదేరానన్న అసంతృప్తి తప్పించి అంతా బాగానే ఉంది. అధమం అయిదారుగంటలు యీ పట్టణపు గడబిడనీ, పరిసరాలనీ వదిలిపెట్టి ప్రశాంతమైనప్రదేశంలో ప్రకృతిమాత ఒడిలో గడపవచ్చుననే ఆశ కలిగి ఉత్సాహం హృదయంలోనిండి ఆనందాన్నాపాదించింది.

అడయారు దాటి మహాబలిపురంరోడ్డుమీద పోతున్నాను. ఒక్కణ్ణేగాబట్టి తక్కువస్పీడ్‌లో ప్రకృతి సౌందర్యం తిలకిస్తూ పోతున్నాను. ఆ ప్రశాంతంగా ఉన్న ప్రకృతిని చూస్తుంటే మనోవీధిలో ఏవేవో భావాలు పరిగెట్టాయి. కవిత్వం వచ్చేస్తుందేమో నని అనుమానంకూడా వేసింది. పద్యసాహిత్యంమీద ఏవిధమైన ఆసక్తి లేనివాణ్ణి పద్యం రాసేస్తానేమో నని భయం కూడ వేసింది. కారణం వెతికితే పరిసరాల ప్రభావం అనిపించింది. "నీరము తప్తలోహమున నిల్చి అనామకమై నశించు......" అన్న పద్యం జ్ఞాపకం వచ్చింది హఠాత్తుగా. నాలో నాకే నవ్వు వచ్చింది

# శిల్పాలలో కల్పన

ఎన్నో ఏళ్ళకి పూర్వం చదువుకున్న పద్యం. ఎన్నో మర్చిపోయాను. ఇదిమాత్రం జ్ఞాపకం ఉండిపోయింది. జీవితంలో చాలా సంఘటనలకి ఉపమానంగా నిలుస్తుంది అంచేత నేమో.

సూర్యుడు మెల్లిగా రంగులు మార్చుకుంటున్నాడు. నా ఆలోచనాస్రవంతిలో నే నీదులాడుతున్నాను. పాం:య్!- హఠాత్తుగా మ్రోగిన హారన్‌లో ఉలిక్కిపడ్డాను. ఆ ఉలికిపాటునించి తేరుకునేలోగానే మళ్ళా మూడుసార్లు మ్రోగింది ఎలక్ట్రిక్ హారన్. అద్దంలోకి తొంగి చూసాను. బ్యూక్-8. స్టీరింగ్ ముందు సుందరాంగి. మహాస్పీడ్‌లో వచ్చినట్టుంది. కారు అడ్డం సహించలేక దారికోసం హారన్ మ్రోగించింది.

ఆమె ఆత్రుత సహనరాహిత్యం మాసేవరకు నాకు చిన్న చిలిపికోరిక ఒకటి ఉత్పన్నమైంది ఆమెను ఏడిపించాలని. అంత ఆత్రుతా యితర్ల విధానాన్ని గుర్తించలేనంత తలబిరుసుతనం లేకపోతే నిశ్శబ్దంగా దారియిచ్చేసి ఉండేవాడిని. కాని సహనం లేని ఆమెధోరణి నన్నున్మత్తుణ్ని చేసింది. కారు వేగం హెచ్చించాను. వెనక్కి ఒక్కసారి చూసాను గాగుల్స్ కనబడ్డాయి. సరే పుట్టిన చెడ్డకోరిక ఎల్లానూ పుట్టిందిగదా కొనసాగించడం ఎల్లాగా అని రెండునిమిషాలు ఆలోచించాను. నేను స్పీడ్ హెచ్చించినకొద్దీ ఆమెకూడ హెచ్చిస్తోంది. దారికోసం నిరాఘాటంగా హారన్ మ్రోగిస్తూనేఉంది. నాలుగైదు గజాలవారలో నడుస్తున్నాయి కార్లు.

సడెన్‌గా వేగం అరవైకి హెచ్చించి కార్లమధ్య దూరం దరిదాపు పాతికగజాలు చేసి సడెన్‌గా బ్రేక్స్ అప్లై చేసాను. యింకేముంది! దూరం ఎక్కువకావడంలో ఉక్రోషం ఎక్కువై ఆ అమ్మాయికూడ వేగం ఎక్కించేసేలోపున కిర్రు శబ్దంలో నాకారాగిపోవడం యిలోపున కార్లమధ్య దూరం నాలుగు గజాలు కావడం ఆ అమ్మాయి బ్రేక్స్ వెయ్యడానికి మహాఅవస్థపడడం జరిగాయి. యింకొక్కక్షణంలో కార్లు గుద్దుకుంటాయి. కాని యీలోగానే నేను బ్రేక్స్ రిలీజ్ చేసి మరో పదిగజాలు పోనిచ్చాను. ఇంతలో భగీరథప్రయత్నం జరిపి ఆ అమ్మాయికారు ఆపేసరికి అది సరిగ్గా నాకారుకి రెండుగజాలలో ఆగడంలో నాకారు యింజన్‌స్టాప్ చేసేసాను. ఇదంతా చెప్పడానికింతసేపు పట్టిందిగాని చిటికలమీద జరిగిపోయింది.

ఆ వారిజాక్షీ నేనూ, కార్లల్లోంచి దిగాం ఒక్కసారే. ఆకోమలాంగి అతికోపంతోను, ఏప్రమాదం లేకుండా అనుకున్నది అనుకున్నట్టు జరిగిన సంతోషంలో నేనూను. అవి మాయిద్దరిచేష్టలలోను బహిర్గతం అయ్యాయి. కారుదిగగానే ఆమె అతివిసాన్నటంగా కారు తలుపులేసేసి పెద్ద శబ్దంచేసింది. గాగుల్స్ ఊడదీసి హస్తాలంకారంగా చేతిలో పట్టుకుంది. అత్యధికమైన నిదానంలో కారుతలుపు జాగ్రత్తగా వేశాను నేను.

మొట్టమొదటిసారిగా ఆమెను పూర్తిగా వీక్షించాను సన్నగా పొడుగ్గా ఉంది. కోలమొహం పసుపుపచ్చని శరీరచ్ఛాయ. 'కన్నుంగవ యాక్రమించునో ముఖచంద్రుడున్' అన్నంత పెద్దకళ్లు నళినీజయవంత్ కళ్ళలా. ముప్ఫైవేలు చేసేముక్కు. చిబుకం మరీ అంత కొనదేరి ఉండకపోతే యింకా బాగుండు ననిపించింది. గుండ్రని మెడ, పరిపూర్ణంగా వికశించిన అవయవాలు. సినీమాస్టార్ల ఫాషన్‌లో గిరిజాలుగా వదలివేయబడ్డ తలకట్టు. ఆకుపచ్చ శిల్కురుమాలు తలమీదనించి తీసుకువచ్చి గడ్డంకింద బిగించింది, చెవులకు గాలితగలడం యిష్టంలేక గాబోలు. కుచ్చిళ్ళదగ్గర అంచుల అద్దకంగల తెల్లవాయిల్ చీరా దానికిసరిగ్గా వ్యతిరేకమైన కాటుకనలుపు శిల్కు చోళీ; తాళ్లు కట్టుకునే నల్ల హైహీల్డ్ శాండల్స్. ఒక్కముక్కలో చెప్పాలంటే ఇరవైయ్యో శతాబ్దోత్తరభాగ నాగరికతను పూర్తిగా జీర్ణంచేసుకున్న మహిళలప్రతినిధి ఆమె. ఆపాదమస్తకం పరీక్షగా నేను చూడ్డంవల్ల కోపం కలిగిందిగాబోలు మొహం జేగురురంగు దాల్చింది. భ్రూకటి ముడిపడింది.

తీవ్రమైన దృష్టి నామీదికి ఒకసారి ప్రసరించింది. ఆచూపుల ప్రభావానికి, పురాణకాలమే అయిఉంటే యమధర్మరాజుగారి అతిథిగా పయనం కట్టి ఉండేవాడిని. కలికాలం కాబట్టి గడిచిపోయింది కష్టం:

“దారికడ్డంగా సడెన్‌గా స్టాప్‌చేసారే ఏక్సిడెంట్ అయితే ఏంచేసేవారు.” అంది మహా అమర్యాదగా.

ఆమెచూపిన అమర్యాద నా కోపవిస్తరణకు మరోసమిధ ఇంకా ఏడిపించాలనిపించింది. దాని

కొక్కటే మార్గం. ఆమె ఎంత విసురుగా మాట్లాడుతోందో అంతకంత మనం అతివినయం ప్రకటించడమే. ఆమార్గమే అవలంబించాను.

"రెండుగజాలదేడాలో తమరు తరుముకుని రావడం ఎందుకు చెప్పండి. పైగా కారు నడపడం బాగా చాతకాకపోయె." అన్నాను మహామర్యాదగా.

కారు నడపడం చాతకాదనడంతో ఆమెకోపం తారాపథాన్నందుకుంది. ఉడికిపోయింది. గొంతుకు చించుకుందామంటే కొద్దిక్షణాలముందే కారాపడానికి నానాతంటాలుపడడం ప్రత్యక్షసాక్ష్యం కళ్లెదుటే ఉంది. ఆ ఉక్రోషం అంతా మాటలలో నింపి అక్కసు్న తీర్చుకుందామనుకుంది. ఎల్లాగైనా ఆడవాళ్ళకి ఆ అవకాశం ఉంది. ఎన్నిఅన్నా నోరు మూసుకోవడం తప్పించి చెయిచేసుకోలేంగా!

"మేనర్‌లెస్‌గా అడ్డం నడుపుతూ యింకా అల్లా మాట్లాడతారేం? దారి యివ్వకపోవడమేం? అంతేకాకుండా రోడ్డు మధ్యలో సడెన్‌బ్రేక్ వేస్తారా?" అంటూ ఘుర్లురిమింది. సిగ్గుకే కందే బుగ్గలు రక్తం చిమ్ముతాయా అన్నట్టున్నాయి.

"మీరు చాలా అమర్యాద ప్రకటిస్తున్నారు. నేను గాబట్టి సరిపోయింది. దారి యివ్వకపోవడానికి అన్నివిధాల అధికారం నాకుంది. ట్రాఫిక్ రూల్సు నాకూ తెలుసు. ఇంకోటి ఏమిటంటే పొరపాటుగా నన్నాడిపోసుకోవడం. మీ నా అదృష్టాలు బాగుండబట్టి ఏక్సిడెంట్ కాకుండా తప్పింది. ఫ్లాట్‌టైర్ కావడంవల్ల కారాగిపోవలసి వచ్చింది. అదీకాక మీరంత కేర్‌లెస్‌గా కార్ నడిపితే ఎల్లాగండీ" అన్నాను మెత్తని చెప్పుతో.

ఆమె ఏకోవిధంగా యింకా గిల్లి కజ్జా పెట్టుకోవాలని చూసింది కాని ప్రమాదం జరిగిఉంటేఉండే పరిస్థితిని ఊహించుకునేసరికి గుండె నీరై ముఖం వివర్ణమయి పోయింది.

"ఆఁ!" అంటూ మహాశ్చర్యంతో బేలతనం ప్రకటించింది.

కాని క్షణంలో సంబాళించుకుంది. యథాస్థితికి వచ్చేసింది. ముందు కర్తవ్యమేమి టన్నట్టు చూసింది. పగిలిన టైరు చూడడానికామె ఉత్సహించక పోవడం కేవలం నా అదృష్టమనే చెప్పాలి. ఆ హడావిడిలో ఆమె కావిషయం స్ఫురించకపోవడం వల్ల నా మన సెంతో తేలికపడింది.

"అయితే యిప్పుడేం చేస్తానంటారు? దారి కడ్డంగా యిల్లాగేపడేసి పెడతానంటారా?"

"మీ రూరికే నామీద విరుచుకుపడితే లాభం లేదు. నేనేం కావాలని చెయ్యలేదు..." అంటూంటే నా పెదవులమీద వెలసిన చిరునవ్వు ఆమె మరేదో ధ్యానంలో ఉండి చూడలేదుకాని చూసిఉంటే అరికాలిమంట నెత్తికెక్కి ఉండేది.

"సరే అల్లాగే ఒప్పుకుందాం. ఇంతకీ ముందు కర్తవ్యం ఏమిటీ అనీ నేను అడిగేది." అంది విసుగ్గా.

అంతతలబిరుసుతనంగల అమ్మాయి చిత్రవిచిత్రమైన అనుభూతుల్ని పొందుతూ ముఖం రంగులు మారుస్తుంటే అతి సులభంగా నాపథకం పారినందుకు నాసంతోషం అవధులు దాటింది.

కాని మానవజీవితంమీద కాలంయొక్క ప్రభావం చాలా ఎక్కువ. అది తెలిసే ఉపేక్షిస్తుంటాం. ఒకక్షణంలో నిర్మించుకున్న ఆశాసౌధాలు మరుక్షణంలోనే భూపతనం కావడం సాధారణంగా తటస్థించేదే. కాని అంతమాత్రంచేత ఆశలు పెంచుకోకూడదని గాని, అదిఘోరాపరాధం అనికాని నాఉద్దేశ్యం కాదు. కాని నేననేదేమిటంటే మన చేతులలో లేదు మనభవిష్యత్తు అని.

"చూడండి. మిస్..." అని వినయంగా ఆమె పేరు తెలుసుకుని కథనడిపిద్దామనుకున్నాను.

"సారీ! మిసెస్ కల్పనారావ్." అమె పెదవుల మీద అదివరకటి విషాదచ్ఛాయ లన్నీ తుడిచివేస్తూ ఆక్రమించిన చిరునవ్వు ప్రస్ఫుటంగా ఉంది.

ఈమాటు ఊసరవెల్లినైనది నేను. నాఅవస్థ వర్ణనాతీతం. నవనాడులు క్రుంగిపోయాయి. ఇలా సిగ్గువిడిచి యిదంతా మీముందు ఏకరువు పెడుతున్నానని మీరు నవ్వవచ్చు. కాని నిజంమాత్రం నివేదిస్తున్నాను. అంతసేపూ ఉన్న ఉత్సాహం అంతరించిపోయింది. ఆమె 'మిస్' అయితే నాకొరిగే లాభమేమిటో 'మిసెస్' అయినందువల్ల నాపుట్టి ఏంమునిగిందో అన్న ప్రశ్న నాజీవితాంతం నిల్చే శేషప్రశ్న. ఏమిటో యిల్లాంటి చాలా ప్రశ్నలు అసమాధానమైనవిగానే ఉండిపోతాయి నాకు. నా హృదయంలోని

కల్లోలాన్ని వదనం ద్వారా ప్రకటితం కానుండా చెయ్యాలని నేచేసిన ప్రయత్నమంతా వ్యర్థమై పోయింది.

నాభావాలు నాలో కలిగించిన పరిణామాన్ని పసిగట్టిన ఆమె (యికమీద కల్పన అనే వ్యవహరిస్తాను.) తృప్తిగా నవ్వుతుంది.

"ఆం! ఏదో చెప్పబోయారు!" అంది అణుచుకున్నా ఆగని చిరునవ్వు వ్యక్తం చేస్తూ. పాక చెక్కలో ముయ్యడానికి వీలౌతుందేమో ననిపించే నోరు యిరువైపులకి సాగి కపోలాలమీద చిన్నిసొట్టలు పడ్డాయి.

ఆ ప్రశ్నలో నాభావప్రపంచాన్ని విడిచి నన్ను నేను సంబాళించుకునే సరికి కొన్ని క్షణాలు పట్టింది. ఇప్పుడు టైర్ ఛేంజ్ చెయ్యాలి. దారియిస్తే ఆమె వెళ్ళిపోతుంది. ఓటమి పూర్తిగా నాదౌతుంది. అందుకని యింకో ఉపాయం పన్నాను.

"మీటూల్ బాక్స్ కొంచెం ఓపెన్ చేస్తే జాకీ తీసుకుని టైర్ మారుస్తాను; మా కార్లో లేదని" అన్నాను.

"అవశ్యం! దానికేం"

తక్కిన కార్లకి అడ్డంరాకుండా రెండు కార్లు రోడ్డు పక్కకు పట్టించాం.

జాకీతో ఎడమపక్క ముందుభాగం లిఫ్టుచేసి స్టెప్నీ తీసుకుని వీల్ ఊడదీసి స్పేర్ టైర్ వెంకనించి మోసుకొచ్చి బిగించేసరికి ఒక అరగంట పట్టింది. వొళ్ళంతా చెమట. లేనిపోని తద్దినం కొనితెచ్చుకున్నానే అనిపించింది. చాలా విచారించాను. చేతుల మసి అంతా టైర్‌కు చుట్టబెట్టబడి ఉన్న కాన్వాస్ గుడ్డకి పులిమి చేతులు విదిలించుకునే సరికి కారు వానుకుని యిటే చూస్తూ బొమ్మలా నుంచునిఉంది కల్పన.

తనగలి నాకు పట్టడంవల్ల కాబోలు ఆమెకోపం చల్లారిపోయిందా? ఆటలో మనతో ఓడిపోయిన వాళ్ళ మీద, మనకన్న పరీక్షలలో తక్కువ వచ్చిన వాళ్ళ మీద సాధారణంగా కోపం ఉండదు మనకు. కించిత్తు సానుభూతి కూడా ఉంటుంది. ఎందుచేతనంటే మనమే వాళ్ళలో యీర్ష్యని రేకెత్తించుతాం గాని వాళ్ళమీద యీర్ష్యపడవలసిన అవసరం మన కుండదు గనుక. ఆమె కోపం పోయిందిగాని నా ముఖం మాత్రం తప్పేలా లాగ తయారైంది.

ఆమె జాకీ ఆమెకి అప్పగించి సభ్యత పాటించాలంటే కృతజ్ఞత తెల్పడం విధి గనుక "చాలా థాంక్స్" అన్నాను ముక్తసరిగా ముభావంగా.

"నో మెన్షన్" అంటూ నవ్వింది మళ్ళీ.

సరే ఆమెతో నాకెందుకని ఊరుకున్నాను. కాని ఆమె నవ్వు నన్నుడికించింది. కాని నిస్సహాయత ఆవరించడంచేత మిన్నకున్నాను.

ఇంక ఆమె దారికి ఆమెని వదిలివేసే నిమిత్తం కారుకి దారియిచ్చేసాను. వెనకాల మెల్లిగా నే బయలుదేరాను. ఆమెకూడ, యిదివరకటి విస్సాటం తగ్గిపోవడంచేతనే ననుకుంటా కారు 'స్లో' గానే పోనిస్తోంది.

మైలు వెనుక మైలు గడిచిపోతోంది. పక్కన నవ్వుతూ ప్రకృతి వెనుకకు పరుగిడుతోంది చెట్ల చాటునించి ఎఱ్ఱగా బంగమూతి పెట్టుకుని ఉదయించిన సూర్యుడు ఆకాశంలోకి పైకి ఎక్కుతూ తెల్లబడి డిగ్రీలుగా ఉష్ణాన్ని అధికం చేస్తున్నాడు. శీతాకాలం గనుక ఎండ అనుభవించ దగ్గదిగానే ఉంది. ఎన్నో కార్లు వెనకాల వస్తూన్నవి తప్పుకు పోతున్నాయి ముందుకు. మా రెండే ఏదో ఆవరించినట్టు మెల్లిగా వెడుతున్నాయి.

మైళ్ళు గడిచి గమ్యస్థానం చేరుకున్నాం. విహారార్థం వచ్చిన జనం తాలూకు కార్లెంకా ఉన్నాయక్కడ రంగు రంగుల సీతాకోక చిలుకలు వారివెంట చిన్నా పెద్దా మొగవాళ్లు కోలాహలం బాగా నేఉంది.

కారు దిగి ఆత్రుతగా యితర కార్లకేసి దృష్టి మళ్ళించింది కల్పన. గైడ్స్ చుట్టవేశారామెని. ఎవరికోసమో నిరీక్షిస్తూ నిరాశ పొందినట్టు తోచింది.

నలుగురు గైడ్స్ మధ్య ఎదురుచూసిన ఎవరో రాకపోగా నిరాశలో నిల్చున్న ఆమెను చూస్తే జాలేసింది. స్థానాన్నిబట్టి, కాలాన్నిబట్టి దృక్పథంలో మార్పుంటుం దనిపించింది. కార్లు గుద్దుకునే పరిస్థితులప్పుడు గద్దింపులవల్ల కందిగడ్డయిపోయి అగ్ని కురిపిస్తున్న ముఖం కాదామె దిప్పుడు. ఆమెలో సరళత్వం చాలా ఉందని ఆమె యిందాక చేసిన హంగామా అంతా స్వభావానికి విరుద్ధమైన ప్రకటనేనని అర్థమైంది.

పోట్లాడుకుంటే పోట్లాడుకున్నాం యీ కాసేపూ యిద్దరికీ తోడులేదు గనక మాట్లాడుకుంటూ

యిందాకటివి మర్చిపోవడం యిరుపక్షాలకీ శ్రేయస్కరమని అనిపించి ఆమెదగ్గర కెళ్ళాను కారుకి వాక్యూంబ్రేక్ వేసి.

"ఎవరినైనా ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారా?" అన్నాను.

పరిస్థితులప్రభావం యింకోసారి ఋజువైంది. ఇష్టం ఉందో లేదో కాని మాట్లాడక తప్పలేదు ఆమెకు.

"ఫ్రెండ్స్ వస్తామని దగా చేసారండీ." అంది నిరుత్సాహంగా. అందులో నాతో మాట్లాడడంలో ఆమెకు అయిష్టత లేదని తెలియడం నాకు ఆనందాన్ని చేకూర్చింది.

"అయితే యిద్దరం ఒకతాడుమీదే నడుస్తున్నామన్నమాట. మావాడు ఒకడు కూడ వస్తానని సమయానికి మోసపుచ్చాడు. సరే కానివ్వండి. ఇంత వరకు వచ్చి చూడకుండా వెళ్ళకూడదా! పదండి చూసి వద్దాం." అన్నాను.

"వీళ్ళని వదిల్చే ఉపాయం చూడండి." అంది గైడ్‌లని చూపిస్తూ.

ఒక్కణ్ణి తప్పించి మిగతా అందర్నీ పంపించి వాణ్ణి తీసుకుని బయలుదేరాం.

ఇంచుమించు మా కార్లాగినస్థలానికి దగ్గరగానే ఒక చిన్నకొండ, గోడలా మలచబడిఉంది. పైభాగాన ఏవో యుద్ధాలు అవీ చేస్తున్నట్టు చెక్కబడి ఉన్నాయి. కింద రాతిలో చప్టా చేయబడిన కుండీలాంటిది ఒకటి ఉంది. అందులోకి దిగడానికి మెట్లున్నాయి. ఆ కిందనించి పైదాక ఆ గోడమీద మలచబడి ఉన్నాయి శిల్పాలు. అక్కడివాట్లన్నిటిలోను దృష్టి నాకర్షించేటట్లున్నది ఒక పెద్ద ఏనుగ చెక్కడం. సగభాగం పైకి కనబడి మిగతా సగం రాతిలో ఉన్నట్టుంటుంది. దూరంనించిచూస్తే ఏనుగ నిలబడిఉన్న భ్రాంతి కల్పిస్తుంది. అక్కడినించి కదిలి యింకా ముందుకు తీసికెళ్లాడు గైడ్.

ఇంతకుముందు చూసిన గోడలా చెక్కబడిఉన్న కొండే ముందుకి ఉంది. దానినించే అతుకులు లేకుండా నాలుగుగదులుగా తొలిచి ఉన్నాయి. ముందరభాగం దెబ్బతింటే పురాతత్వశాఖవారు స్తంభాలు అవీ కట్టి ముందుకి ఎక్స్‌టెండ్ చేసారు. ఈ క్రొత్తభాగంలో తప్పిస్తే పాతభాగంలో అతుకనేది కనబడదు. అందులో మూడుగుహలు పాండుతనయులలో ముగ్గురివనీ నాలుగోది ద్రౌపదీదేవి దనీ సెలవిచ్చాడు గైడ్. పన్నెండేండ్ల అరణ్యవాసంలోను యిక్కడ ఎప్పుడో ఉన్నారట. తను స్వయంగా చూసినట్టు యిక్కడ ద్రౌపదీదేవి బట్టలు ఆరగట్టుకునేదనీ యిక్కడ వంటచేసేదని వాటికి ప్రమాణాలు కూడ ఉన్నాయని చూపించాడు. విగ్రహస్థలాలు ఆ గుహలోనే.

అక్కడినించి బయలుదేరి మళ్లీ వెనక్కువచ్చి మొదటిచోటు దగ్గరనుండి యీమాటు కుడివైపుకు తీసుకుని వెళ్లాడు. అక్కడ రెండు గుట్టలమధ్య ఒక చీలికలాగ కిందనించి పైకి సన్ననౌతూ పోతోంది. బాగా 25,30 అడుగుల ఎత్తుంటుంది పైకిగుట్ట. ఆరెండు గుట్టలమీదకి ఆనేటట్టు పాత్రలుంచి క్రిందనుంచి మంటపెట్టి భీముడు వంటవండేవాడట. దానికి సాక్ష్యం ఆప్రక్కనే ఉన్న యింకోగుట్ట. అది ఆయన భోజనప్రదేశమట పది పదిహేను అడుగుల దూరంపాటు సాధ్యమైనంత చదునుగా ఉంది గుట్ట. ఆగుట్టమధ్యగా వేలు వెడల్పుగాడి ఒకటిఉంది 7, 8 అడుగుల పొడుగుపాటిది. అక్కడినించి చుట్టు ఒక సన్ననిగీతలాఉండి అరిటాకుపోలికలు తెప్పించేలాగుంది. అది భీముడు భోజనంచేసిన అరిటాకుట. ఆప్రక్కనే భౌతికశాస్త్రాన్ని స్థూలదృష్టికి హేళన చేస్తున్నట్టు కనబడేదృశ్య మొకటుంది. ఆగుట్టే ఆకులా వున్న భాగం ప్రక్కనుంచి ఏటవాలుగా భూమట్టానికి దిగిపోయింది. ఆ వాలుగా ఉన్న అంచుమీద ఎంత జాగ్రత్తగా నిలుచున్నా పడతామేమో ననిపించేటట్టుంది. ఆ ఏటవాలు భాగం మీద రమారమి పది, పదిహేనడుగుల గుండ్రాయి ఒకటి చాలా తక్కువభాగం కింద ఆనుతూ ఉంది. ముట్టుకుంటే పడిపోతుందేమో నన్నట్టుంది. ఆకాస్త ఆధారంతో అంత పెద్దరాయి ఆఏటవాలు గట్టుమీద ఎల్లా నిలిచిందో ఆశ్చర్యం వేసింది. భౌతికశాస్త్రరీత్యా గరిమనాభినుండి భూమికి గీసిన లంబరేఖ, బేస్ లైన్‌మీదనే పడుతూ ఉండిఉండవచ్చునుగాని పైకి మాత్రం చాలాచిత్రంగా కనబడుతుంది. ముట్టుకుంటే పడిపోతుందేమో నన్నంత సున్నితంగా కనబడుతూ

# శిల్పాలలో కల్పన

ఎన్నివందల సంవత్సరాలుగానో అదేరీతిగా ఉంది! అది భీముడు భోజనంలోకి ఉపయోగించిన వెన్న ముద్దట!

అక్కడినించి పైకెళ్ళబోతూంటే చిన్న ప్రమాదంలాంటిది జరిగింది. కల్పనాదేవిగారు గుట్టలెక్కడం మొదలుపెట్టినప్పటినించీ వారి హైహీల్డ్ శాండల్స్‌తో బాధపడుతునే ఉన్నారు. తీసేద్దామంటే నాగరికతకి లోపం. ఇవి నాగరికత తగిలించిన శృంఖలాలు. వాటివల్ల లభించిన బాధ మానవుడు ఆ నాగరికతకి చెల్లించే సుంకం అన్నారెవరో. ఆయన నాగరికత జంజాటంలో ఎంత అవస్థపడి సెలవిచ్చారో ఆమాట. ఈ ఆడంబరాలన్నీ లేకపోతే, యీ రోజుల్లో సంఘంలో సభ్యత, గణన కావలసినవాళ్ళకి కాలు సాగదు. నావి క్రేప్‌సోల్డ్ షూస్ కావడంవల్ల నాకు బాధ లేకపోయింది. అలా పైకెడుతూంటే ఒకచోట చిన్న యిరుకుదారంట వెళ్ళవలసి వచ్చింది. ఒక పక్క ఎత్తుగా గుట్టలు రెండోవైపున యింకేం ఆధారం లేదు. కింద లోతుగా రాళ్లు ముళ్లు. అక్కడ నడుస్తుండగా ఎంతజాగ్రత్తపడ్డా అమ్మగారిపని తలక్రిందులైంది. కాలుజారి కెవ్వుమంది. కిందపడేలోపునే రెండు జబ్బలు పట్టుకు ఆపి నేను పడబోయేసమయంలో గైడ్ నన్నాపాడు కాని లేకపోతే యిద్దరం కూడ మాపోట్లాటలు మర్చిపోయి పరలోకంలో గాని ఇహలోకంలో నరకంలాంటి హాస్పిటల్‌లో గాని తల్పాలమీద స్మృతితప్పి పడిఉండేవాళ్లం.

కొంచెం పైకి వచ్చింతరువాత మళ్ళీ కొంచెం చదునైన ప్రదేశం వచ్చింది. అక్కడికొచ్చాక "మీకు కోపం రాకుండా ఉంటే ఒక్కమాట" అన్నాను.

"ఏమిటది?"

"ఆ జోళ్లు ఊడదీసి మీ హాండ్‌బాగ్‌లో పడేసి చేతపుచ్చుకోండి. ఇంకోమాటు పడబోయారంటే మీకోసం నా ప్రాణంకూడ 'రిస్క్' చెయ్యలేను. ఇప్పటికే చావుతప్పి కన్ను లొట్టపోయినంత పనైంది."

సూదులు పొడుస్తూ తీక్ష్ణమైన వీక్షణం ఒకటి నామీదికి విసిరి జోళ్లువిప్పే కార్యక్రమంలో నిమగ్నురాలైంది కల్పన. కాని, యీ చదువుకున్న స్త్రీలకి చెప్పుకోదగ్గ సుగుణం ఒకటుంది. వాళ్ల అవసరాలైనా కనీసం వాళ్ళకి తెలుస్తాయి బాగా. జోళ్ళు తీసెయ్యమన్నానే కాని ఆ మృదువైన పాదాలు ఆ కఠిన శిలాప్రదేశ స్పర్శసోకి కందిపోతాయే ఎల్లాగా అని బాధపడ్డాను. నా బాధ నివారణచేస్తూ ఆ సంచీనించే రబ్బర్ స్లిప్పర్స్ తీసి తొడిగింది.

"ఎల్లాగైనా శ్రద్ధ విషయంలో మొగాళ్ళకంటే మీరే నయం" అని అభినందించకుండా ఉండలేకపోయాను.

"ఏం?" అంది ఆశ్చర్యంగా చూస్తూ.

తలకి చుట్టుకున్న సిల్కు రుమాలు తీసేసి ముఖం మీద చిరుచెమట తుడుచుకుంది.

"చూడండి! ఏ పరిస్థితులలోనైనా యీ జోళ్లు తీసెయ్యవలసివస్తే కాళ్లు బద్దలు చేసుకుంటూ నడవాలి నేను. కాని మీరు? కనీసం మీ విషయాలలోనైనా శ్రద్ధగా ఉంటారు మీరు. నాకు నిజంగా సంతోషం వేసింది మీ జాగ్రత్త చూసి."

"అంటే మేం స్వార్థం మూర్తీభవించిన వాళ్ళమన్నమాట, అంతేనా మీ ఉద్దేశ్యం?" అంది డొంక తిరుగుడుగా.

"ఆ మాటన్లేదు నేను. మీ కంతగా యిష్టమైతే లంచ్ టైమ్‌లో ప్రస్తావిద్దాం ఆ సంగతి" అంటూ ఆపేసాను యిక ముందుకు సాగనివ్వకుండా.

ఇక్కడ ఒక్కమాట చెప్పాలి. యథార్థమైన స్నేహం కలవడానికి చాలాకాలం కావాలనడం అబద్ధం అన్నాడు శరత్. ఆ మాటలు అక్షరాల నిజమని నా అనుభవంలో చాలాసార్లు ఋజువైంది. ప్రాణస్నేహంగా యిప్పుడు కలిసి తిరిగే మధుకూ నాకూ రైల్లో మొదటి పరిచయం సరే పోనివ్వండి ఆ విషయం ఇప్పుడు అప్రస్తుతం.

మా మాటలు అర్థంకాని గైడ్ వెర్రిమొహం పెట్టి నిలబడ్డాడు మాకోసం. అక్కడినించి కదిలి యింకా గోపురాల్లాంటివి చాలా చూసాం. అన్నింటిలోను ఒక ప్రత్యేకత ఏమిటంటే అన్నీ కూడ ఏక శిలా శిల్పాలు. నాకు విభ్రాంతి కల్పించిన విషయమేమిటంటే; పిన్సిలు రబ్బరు పుచ్చుకు కాగితం మీద వందసార్లు చెరుపుతూ గీస్తూ నానాతంటాలు పడి కూడ ఒకమాదిరి బొమ్మ వెయ్యలేమే? అల్లాంటిది చెక్కడం, అందులోను ఒక పెద్ద బండరాతిని తీసుకుని వివిధవిధాలుగా దాన్ని మల్చుకురావాలంటే! ఆ నిర్మాణ విధానమంతా ముందరే మనసులో

చిత్రించుకోవాలి, అక్కడినించి మలచడం ప్రారంభించాలి. ఎంతో కౌశలంతోనూ జాగ్రత్తగాను చెక్కాలి. పొరపాటున ఒక చిన్న ముక్క ఎక్కువ ఊడివస్తే అతికే సాధనం లేదే; అల్లాంటిది గోపురాలు? గోపురాలు, దేవాలయాలు ఒక్కొక్క రాతిని చిత్రంగా మలిచిన శిల్పులు ఎంత గొప్పవారా అని. శిల్పాలనిగురించి మనకేం తెలియకపోయినా ఆ పనితనం, ఆ చాతుర్యం, ఆ ఓర్పులనుగురించి ఆలోచిస్తే దిగ్భ్రాంతచిత్తులం కావడం తప్పదు. చిన్న బొమ్మ కాదు, ఒక విగ్రహం కాదు! అమాంతం బండరాళ్ళను గుళ్లు, గోపురాలు, మందిరాలుగాను మార్చివేశారు.

అక్కడే మరోగుట్టమీద సగంవరకు కట్టి వదిలివేయబడిన ప్రాసాదం ఒకటి ఉంది. విశాలమైన గదులు పెద్ద సింహద్వారం సగంవరకు కట్టబడి ఆగిపోయాయి. ఆ అసంపూర్ణప్రాసాదం తాలూకు సింహద్వారంవద్ద నిలబడిచూస్తే ఒకవైపు రమారమి యిరవై మైళ్ళలో ఉన్న పక్షితీర్థం కొండమీది ఆలయ గోపురం, వెనుకపక్కకు చూస్తే మామల్లపురంఆలయం కనబడతాయి. పల్లవరాజులకాలంలో ఎవరో మహానుభావుడైన ఒకరాజు ఎదురుగా చూస్తే పక్షితీర్థ దేవళం గోపురం కనబడేటట్టు నిర్మించుకుందామని ఒక ప్రాసాదం ప్రారంభించాడు. సగంతరువాత అది ఎందుకనో పూర్తి చెయ్యబడలేదు. ఆ మొండిగోడలవైభవం అల్లాగే ఉండిపోయింది.

ఆ శిల్పాలు చాలాభాగం పల్లవరాజులకాలం నాటివి. ప్రతిశిలాఖండందగ్గర దానినిగురించిన గ్రంథం అంతా బోర్డుల మీద వ్రాయించి అట్టిపెట్టారు పురాతత్వశాఖవారు. కాని అవి చదివేఓపిక లేకపోయింది మాకు. మాకేకాదు చాలామంది యీ విషయంలో అంతేనంటే అతిశయోక్తి కాదనుకుంటా.

గుట్టలు ఎక్కిదిగి, గోపురాల్లాంటివి చాలా చూసాం. వాట్లనిగురించిన చరిత్రంతా గైడ్ తంబాకు నోటిమీదుగా విన్నాం. అది వాడి వృత్తి. వాడికి వాళ్ళనాయన అన్నీ చూపించిచెప్పి కంఠతా పట్టించి ఉంటాడు. వాడికి వాళ్లనాయనా యిల్లా తరతరాలుగా విని నేర్చుకున్న చరిత్ర వాడిది. వాడి కదే జీవనాధారం. రోజూ వచ్చేపోయేవాళ్లందరికి పాఠం అప్పగించి వాళ్ళిచ్చే తృణం పణంతోటి జీవిస్తారు. వాడివిధి గనక అంతా అప్పగించాడు. అంతా మేం అర్థం చేసుకున్నామా అనేది ప్రశ్న అయితే సమాధానం సున్న. వాట్లవైభవం చూసి సంతోషించడంలోనే సంతృప్తులమయ్యాం. చూసినవన్నీ చూసినట్టు నలుగురికి చెప్పాలన్న కుతూహలం కాని, సామర్థ్యం కాని, ఒక కథలోకి ఎక్కించాలని అభిలాష గాని నాకు లేవాయె. అల్లాంటప్పుడా పల్లవ రాజుల చరిత్రంతా విని కంఠస్థం చెయ్యవలసిన అవసరం నాకేముందీ? అసలుం పోనీ నేను చరిత్ర విద్యార్థినైనా కాదు, గైడ్‌తో సమానంగా ఆ కర్మల శర్మల చరిత్రంతా ఏకరువు పెట్టినందుకు ఫలితం పొందడానికి.

చూసి జ్ఞాపకం పెట్టుకోవలసిన వింకా కొన్ని ఉన్నాయి. ఇంకా గుట్టమీద లైట్‌హౌసుకు వెళ్ళే దారిలో నాలుగైదు బండరాళ్లున్నాయి అవి కమఠాకృతిలోను, మండూకాకృతిలోను చెక్కబడి ఉన్నాయి. వాటిసందర్శనం నన్ను విస్మితుణ్ణి చేసింది. కూర్మం కళ్ళు తలా లోపలకు ముడుచుకుని ఉన్న ఆకారంగా ఉందా రాయి. నడుముమీద ఎత్తుగాఉండి కుడి ఎడమలకు ఏటవాలుగా దిగుతూ ముందువెనుకల చివరున మాత్రం కిందకుదిగి, అచ్చుతాబేలు ఆకృతి వచ్చేటట్టు చెక్కబడిఉంది. ఇక మండూకాకృతిలో ఉన్నది యింకా చిత్రంగాను ఆశ్చర్యప్రదంగాను ఉంది. కప్ప వెనక రెండు కాళ్లమీద ఆధారపడి ముట్టె పైకి పెట్టి కూర్చున్నట్టుంది. రెండు కాళ్ళు ఆనినంత భాగానికి మాత్రమే ఆధారం ఉంది. మిగతాదంతా గాలిలో, ఉంది. రాతిక్రిందిభాగం కప్పకి పొట్టకింద చదునుగా కనబడే విధంగాను పైనభాగాన మూపుఎత్తుగా ఉండి ముట్టెభాగం పల్చగాదిగి ఒక కొనగా కిందిపైభాగాలు కలుస్తాయి. భేకం వెనుకకాళ్ళమీద కూర్చున్నట్టు భ్రాంతి కల్పిస్తుంది ఆరాయి. యీ ఆకృతులు ఆ పోల్చదగిన జంతువుల పరిమాణాలకి వందలరెట్లు ఎక్కువ పరిమాణం కలవి.

ఉన్న గుట్టలలోకల్లా ఎత్తైన దానిమీద పాతది, కొత్తది రెండులైట్‌హౌస్‌లున్నాయి. పాతదంటే ఏమీ లేదు నలుచదరపు ఎత్తైన ఒకమందిరంలా ఉండి పైన డాబా. అది ఎక్కడానికి పక్కనించి మెట్లు

అవీ ఉన్నాయి. పూర్వం దానిమీఁదే దీపాల్లాంటివి పెట్టి నావికులకు గుర్తు తెలిపేవారు కాబోలు. దాని మీఁద కెక్కితే చుట్టుపక్కల ప్రదేశాలు, సముద్రం కనబడతాయి. అసలు చూడవలసింది కొత్త లైట్ హౌస్. దానికేదో టెక్కెట్ కూడ ఉంది. కల్పన యివ్వడంచేత ఎంతో నాకు తెలియలేదు. పావలాకి దగ్గరలో ఉంది మొత్తానికి. సుమారు నూటయిరవై అడుగుల స్తంభంలోపల విధిగా చల్లగానే ఉంటుందనుకోండి. క్రిందద్వారంనించి లోపలికెళ్లగానే విసనకర్ర ఆకారంగా తిరుగుతూ పైకివెళ్లేమెట్లు. పైకెళ్లే వరకూ పైనించి కిందవరకు కనబడుతూనే ఉంటుంది. వెలుతురుకోసం ఆగోడలోనే వివిధఎత్తులలో కిటికీలు గాజుతలుపులు ఉన్నాయి. పైన దీపపుటేర్పాట్లకు పరికరాలు. మామూలు గ్యాస్ లైట్ వత్తి ఉంటుంది. దానిమీద వేడిచేసింతరువాత కిరసనాయిల్ స్ప్రేచేసే ఏర్పాటు మామూలు పెట్రొమాక్స్ లైట్ కు లాగే ఉంటుంది. కాని యీవత్తి కిందనించి పైకి గాలిలోకి ఉంటుంది. యీ మొత్తం దీపసాధన మంతా ఒక రాడ్ కి తగిలించి ఆరాడ్ ఫ్రిక్షన్ (ఒరిపిడి) లేకుండా ఒక దానిలో ఒకటి తిరిగే రెండుకప్పులలో ఒకదానికి తగిలించి ఉంటుంది. ఈసాధనమంతా తిరగడానికి క్లాక్ వర్క్ మెకానిజం ఉంది. ఆవత్తినించి వచ్చే కొద్ది వెలుతురిని గాజుపట్టకములలోనించి పంపించి శతాధిక పరిమాణంగల కాంతి పుంజం వెలువరిస్తారు. ఈ కాంతి పుంజం తిరుగుతూ ఉంటుంది. ఒకే కిటికీ తెరవబడి తక్కిన వైపులన్నీ మూసి ఉండడంచేత ఆకిటికీ దగ్గరకు రాగానే మాత్రం కనబడి మళ్ళీ మాయమౌతూ ఉంటుంది. ఆవిధాన మంతా చాలా చక్కగా ఉంటుంది. సుమారు నూరు అడుగుల ఎత్తున ఉంటుం దీ దీపసాధనం. అక్కడే స్తంభానికి చుట్టూ బైట డాబాలాగా ప్రొజెక్షన్ ఉంది. దాని చుట్టూ యినప గొట్టాలు అడ్డం పెట్టారు పడిపోకుండా. దానిమీదకు వచ్చి చుట్టుపక్కలు పరికించడానికి వీలుగా ఉంటుంది.

అక్కడ నిలబడిచూస్తే ఏమి వైభవంగా ఉంది దృశ్యం. కిందకుచూస్తే కళ్లు తిరిగాయి. అక్కడినించి కిందపడితే అనమాలైనా వదిలి పెట్టకుండా యమధర్మరాజుగారి దున్నపోతుమీద విహారసంచారం బయలుదేరవచ్చు. అదీ కలిగిన మొదటి అనుభూతి. మానవప్రకృతి చాలా చిత్రంగా కనబడుతుం దిల్లాంటి విషయాలలో. ఒక చక్కని హార్మ్యంచూస్తే ఆ వైభవం తిలకించి తర్వాత ఎంతైనా ఆనందించనీ మొదట అంచనాకి వచ్చేది దాని ఖరీదు. ఎత్తైన ప్రదేశం ఎక్కితే అక్కడినించి పడితే ఏమౌతుందనే ప్రశ్న; ఉధృతమైన వరదమీద ఉన్న నదిమీద ప్రయాణం చేస్తుంటే చుట్టూ ఉన్న హృదయంగమమైన దృశ్యం చూడడం కన్న ముందు వచ్చేది పడవ తిరగబడితే ఏంచెయ్యాలి అని. అంటే అవి పరిహాసం చెయ్యతగిన విషయాలని నేనెంతమాత్రం అనటంలేదు. కాని చిత్రమైన ఊహలని మాత్రం అంటున్నాను. పడినా లెక్కచెయ్యనివాడే కొండ ఎక్కతాడు. మునిగిపోవడానికి ఒప్పుకున్నవాడే వరదలలో పడవమీద ప్రయాణం చేస్తాడు. కాని యీ ఊహలు మాత్రం తప్పవు. అల్లాగే నాకు కలిగిన మొదటి అనుభూతి అదీ. చుట్టూ సుందరమైన దృశ్యం కన్నుకి కనబడినంతమేర చుట్టూ పచ్చని చెట్లూ దూరాన కొండలూ మూడువైపుల; నాలుగోవైపున అనంత జలరాశి. నడిమధ్యాహ్నపు టెండలో నల్లని నీలపురంగు సముద్రం, ముదురు నీలపు నీటిమధ్య కెరటాలు విరగడంవల్ల కలిగిన తెల్లని నురుగు. అంతులేని సాగరం. సముద్రంలో నల్లని మబ్బుల నీడలు అక్కడక్కడ ఆ భాగాలలో నీటిరంగు నల్లగా కనబడుతుంది. సముద్రపు నీళ్ళతీరు చిత్రంగా ఉంటుంది. చేతిలోకి తీసుకుంటే ఏ రంగు ఉండదు ఒక గంగాళం నీళ్ళు లేత ఆకుపచ్చరంగుగా కనబడతాయి అంతులేని సాగరంలో నీలిరంగు నీరు. సముద్రపు నీరు నీలంగా ఉండడానికి కారణాలు వెతకడం, ఆకాశపు నీలిరంగు నీళ్ళలో ప్రతిబింబించడంచేత అల్లా కనబడుతోందనే వాదన, ప్రతిబింబంయొక్క రంగు దట్టం వస్తువుయొక్క రంగు దట్టంకంటె తక్కువ ఉండాలి. కాని ఆకాశపు నీలిరంగుకంటె కడలి నీలిరంగు దృఢంగా ఉందని ఆ ప్రతిపాదన ఖండనా దానినించి యితర కారణాలు వెతకడం, కాంతిప్రసరణ, రామన్ ఎఫెక్టు, అన్నీ ఒక్కసారి స్ఫురించాయి. ఈ ఆలోచనల భారంతో ఒక స్తబ్దత ఆవరించింది నన్ను.

"కిందకు దిగుదామా?" అంది కల్పన.

ఆ ప్రశ్నలో హృదయంలో ఏవో ఆలోచిస్తూ ఊహాజగత్తులో కొట్టుకుపోతూ ఉన్న నేను ఉలిక్క

పడి కల్పనవైపు నిరర్థకమైన చూపు ఒకటి విసిరాను. ఆ ప్రదేశం కొత్తదని కాని, విహారార్థం మాత్రం వచ్చామని కాని, వెంటనే కాకపోయినా మరో కొద్ది నిమిషాలకైనా దిగిపోక తప్పదని కాని అన్నీ మర్చిపోయాను.

"భలే! సమాధిలోంచి ఊడిపడ్డ ట్టులిక్కిపడ్డారే?" అంది నవ్వుతూ.

"దానికి సమాధానం తరువాత చెప్తాను కాని ముందు దిగండి." అని గబగబ దిగడం ప్రారంభించాను. నాతో నే ఆమె కూడా దిగిపోయింది.

అప్పటికి ఒంటిగంట కావచ్చింది. ఎంత శీతాకాలమైనా ఎండ తీక్షంగా ఉండడంచేతా ఎక్కి దిగడాల ఆయాసంవల్లా చమటపట్టింది. చిరాకుగా ఉంది. ఎక్కువ భాగం చూసేశాం. ఇంక ఏడు రథాలు, మామల్లపురం దేవాలయం, సముద్రం దృశ్యం మాత్రం మిగిలాయి. ఎప్పుడో పొద్దున్న తిన్న తిండేమో ఆకలికూడ కరకర వేస్తోంది.

"కాస్త నాలిక తడుపుకుని మళ్ళీ ప్రారంభిద్దాం కార్యక్రమం." అన్నాను కిందకు వచ్చిం తరువాత.

"తప్పకుండాను. ఆమాటే మీతో చెప్దామనుకుంటున్నాను. మీరు కూడా ఏమైనా తీసుకు వచ్చారా?" అంది కల్పన.

"ఏదో కాఫీ, కాసిన్ని స్వీట్స్. అన్నీ హోటల్ వే."

"ఏం బెంగపడకండి. నలుగురు ఫ్రెండ్స్ వస్తామనడంచేత బోలెడు మోసుకొచ్చాను యింటిదగ్గర చేయించి. అవి ఖాళీ చెయ్యడంలో సాయపడండి చాలు." అంది నవ్వుతూ.

ప్రొద్దుటి క్రోధస్వరూపం తెచ్చిపెట్టుకున్న దేనని దృఢపడింది ఆమె యీ తరువాతి ప్రవర్తన వల్ల. లేకపోతే యింత సౌమ్యంగాను, సరళంగాను స్నేహపూర్వకంగాను ఎల్లా సంచరించగలదు ఆమె స్వభావమే అంత అయితే. ఉన్నతవిద్య నభ్యసించిన మహిళఅయి ఉండాలి. అనవసరపు భేషజాలు, సిగ్గులు, సంకోచాలు ఏవీ లేవు. ఈ కాస్త పరిచయానికే చాలా కలుపుగోరుతనంతో ప్రవర్తించింది సంకోచాన్ని దూరంచేసి.

కార్లదగ్గర కెళ్లాం యిద్దరం. నా సామాను కొంచెమే. నాలుగుపొట్లాలు ఫ్లాస్కు బైటకు తీశాను. ఇంక ఆమె ఒక పాకేజీపెట్టెనిండా వివిధవస్తువులు పట్టుకుని తయారైంది. అది మోసుకుపోవడం తేలికైనపనేమీ కాదు.

"మీరు మొయ్యలేనంత బరువు మోసుకొచ్చారే?"

"అంతా విని మొదటికొస్తారు? ఇంక నాలుగు గ్రహాలు రావలసినమాట. తిండివిషయం అంతా నానెత్తిన పెట్టారు. చచ్చి చెడి వస్తే క్రియకి ఒక్క చిలకా కనబడదు. రేపు కాలేజిలో చెప్తాను వీళ్లపని" అంది కిందిపెదిమ ఎడమకొన మునిపళ్ళమధ్య బిగించి తలఊగిస్తూ చిన్నపిల్లలా. అదిచూసిన నాకు నవ్వాగిందికాదు. అతిచిత్రమైన దీఅమ్మాయి — మొగుడెంత అదృష్టవంతుడో! అనిపించింది.

అక్కడ ఎవడినో పిలిచి సామాను వాడినెత్తిన పెట్టాము. విలువైనకార్పెట్ ఒకటికూడ మోసుకొచ్చింది. ఎల్లాగయినా యీ ఆడవాళ్లు మహా ఘటికులు. నాకు ఏడురాత్రిళ్ళు ఏడుపగళ్ళు కూర్చుని దీర్ఘంగా ఆలోచించినా ఒక చాపగాని కార్పెట్ గాని అవసరమని తోచదు. అలాంటి దామెకు అది చాలా సహజంగా గోచరించింది.

ఆవూరు చాలా చిన్నది. ఒకవీధి యింకో చిన్న అడ్డవీధి. ఆ చిన్న అడ్డవీధిలో రెండుమూడు కిళ్ళీదుకాణాలు రెండు హోటళ్ళు ఉన్నాయి. ఒక దేవాలయం ఎదురుగా ఉంది. దేవాలయానికి యింకో పక్క శిల్పాల మ్యూజియం ఒకటి ఉంది ఒక ఆవరణలో. ఇంక ఉన్నయిళ్ళన్నీ ఆ నిలువువీధిలో నే ఉన్నాయి. ఒక చిన్న పోస్టాఫీసు, పోలీస్ స్టేషన్. ఒక ప్రాకారంలోపల లైట్ హౌస్ స్టాఫ్ కి యిళ్లున్నాయి. ఆ ప్రాంగణం అంతా చెట్లు చేమలతో ఒకపార్కులాగ ఉంది. చాలా అహ్లాదకరంగా ఉంది. మాలాగే దర్శనార్థం వచ్చినవారంతా ఎవరికి వీలైనచోట వారు చాపలు జంపఖానాలు పరిచి భోజనాలు కానిస్తున్నారు. అది అయినవాళ్లు విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆ ఆవరణలో నే నుయ్యొకటి ఉంది; యీ యాత్రికుల ఉపయోగార్థమేమో. కాళ్లు చేతులు కడుక్కుని ఒక గుక్కెడు నీళ్ళు నోట్లో పోసుకున్నాను. అమృతం రుచి ఎరగను

గాని అదికూడ యింత రుచిగా ఉంటుందంటే నమ్మను. పచ్చి పానకంలాగున్నాయి నీళ్లు. స్థల ప్రభావం అన్నీ అల్లా సమకూడాయి మరచెంబుతో నీళ్లు పట్టుకెళ్లాను.

అప్పటికే ఆమె ఒక చల్లని వృక్షచ్ఛాయలో తివాసీపరిచి రెండు పింగాణీ ప్లేట్లలోకి ఖాద్యవస్తువులు సద్దుతోంది. ఆమె అప్పటి ఆ ముగ్ధరూపం నా హృదయంమీద అంకితమైంది. ఆమె నాగృహిణి అయిఉంటే? అనుకున్నాను. ఇన్‌స్టింక్ట్ అంటారే అది అల్లా అనిపించింది.

"రండి! ఇవాళ మీరు నాకు అతిథిగా లభించటం అదృష్టం. మర్యాదగా ఆహ్వానించింది.

తివాసీమీద కూర్చుని జోళ్లువిప్పి అవతల గడ్డిలో ఉంచాను.

"మన పరిచయం పోట్లాటతో ప్రారంభం కావడంచేత మీ పేరు తెలుసుకోవడం పడలేను చెప్పడానికేమైనా అభ్యంతరం ఉందా?"అంది స్వచ్ఛంగా నవ్వుతూ. అల్లా నవ్వగలిగినవాళ్లని చాలా కొద్ది మందిని చూశాను నా అనుభవంలో. అనుభవించదగ్గదిగా ఉంటుంది శరద్రాత్రిలో వెన్నెల శోభలాగ.

"ఎంతమాత్రం అభ్యంతరం లేదు." అని పేరు చెప్పాను.

"మన పరిచయం కొద్దిగంటలనించే అయినా మిమ్మల్ని ఎప్పటినించో ఎరుగున్నాననిపిస్తోంది. 'స్నేహం సాప్తపదీనం' అంటారే అది నిజమేననిపిస్తుంది యిల్లాంటి బుజువులు దొరికినప్పుడు. ఇల్లా అంటున్నానని మరోలా అనుకోకండి. కాని పోట్లాటే నాంది అయినా మీపరిచయం అయినందుకు చాలా సంతోషంగా ఉంది." అన్నాను నేనే మళ్ళీ

"ఏం? ఏమిటి నాలో ప్రత్యేకత?" అంది కృత్రిమహాసంతో. శరత్ కమల కనుపించింది ఆమె యీమాటలో.

"ప్రత్యేకత ఏమిటని సూటిగా ప్రశ్నిస్తే చెప్పలేను బహుశః మీరు సంకోచంలేకుండా కలిసిమెలిసి ఉండగలగడమే ననుకుంటాను. చూడండి! ఇదంతా చిత్రంగా లేదు? కొద్ది గంటలక్రితమే ఘోరంగా పోట్లాడుకున్నాం. కాని మీకు మీఫ్రెండ్స్ నాకు మామధ్య ఉండకపోవడంచేత, పోట్లాటరూపేణా అయినా పరిచయలమంటూ ఉన్నది మనిద్దరికి ఒకళ్లకి ఒకళ్లమే గనక కలిసి తిరిగాం. ఈకొద్దిగంటల్లోనే చాలా సన్నిహితత్వం వచ్చింది. శరత్ నవలలోని విలువకి యిల్లాంటప్పుడే నిదర్శనాలు దొరుకుతాయి."

"మీకు సాహిత్యంఅంటే చాలా యిష్టంలాగుందే చూస్తే. ఇంతకీ మీఉద్యోగం? చేసేది ఉద్యోగమైతే." అంది కల్పన.

"ఏదో సామాన్యమే. ఆటో మొబైల్ ఎంజనీర్‌గా ఉంటున్నాను."

"సామాన్యమేం? పెద్ద ఉద్యోగస్థులే నన్నమాట. ఇవాళే కాకపోయినా భవిష్యత్తులోనైనా."

"ఏదో పెద్దోచిన్నో. వీటికి అంతేక్కడ చెప్పండి. సంతృప్తికావాలిగానీ. ఇల్లాంటి దాని మీదే పిట్టకథలాంటి దొకటి చదివాను ఎక్కడో. బ్రిటిష్‌వాళ్లు చాలా కాయకష్టం చేస్తారు. సోమరితనం సహించరు. అటువంటి పెద్ద బ్రిటిష్ వ్యాపారస్థుడు ఒకడు ప్రపంచంలో కల్లా సుందర ప్రాంతమైన నేపిల్స్ వెళ్లాడట. అక్కడ ఒకనాడు పొద్దున్నే చూచి రావడానికి బయలుదేరి దారిలో ఒకచోట కొలనులో చేపలుపట్టే వాడిని ఒకణ్ణి చూశాడు. తిరిగితిరిగి సాయంత్రం వచ్చేవేళకి ఆ జాలరి యింకా అల్లాగే కూర్చున్నాడు. పట్టిన చేపలా పట్టెడు కన్న ఎక్కువలేవు. ఈ వ్యర్థుణ్ణి చూసేసరికి ఆ బ్రిటన్ వాసికి ఒళ్లుడికిపోయింది. వాడి దగ్గరకెళ్ళి "పొద్దున్నించీ యివేనా పడ్డాయ్?" అన్నాడు. "ఆ," అన్నాడు జాలరి. "నేనైతే ఏంచేసేవాడినో తెలుసా?" అన్నాడు బ్రిటిష్ వ్యక్తి. "ఏంచేసి ఉండేవాడివి?" ప్రశ్న. "పడవడు చేపలు పట్టిఉండేవాడిని." "పట్టి?" "అలాగ రోజు రోజుకీ వ్యాపారం అభివృద్ధి చేసేవాడిని." "చేసి?" "భాగ్యభోగాలతో సుఖంగా ఉండేవాడిని." "అల్లాగా పాపం! ఆ సుఖమేదో నేనిప్పుడే అనుభవిస్తున్నాను. దానికి నువ్వు చెప్పిన కష్టం అంతా పడడం ఎందుకు." అన్నాడట నేపిల్స్‌నివాసి. బ్రిటిష్‌వాడు నిశ్చేష్టుడయ్యాడు. వాడి కది తృప్తి. వీడి కిది తృప్తి. అనవసరంగా ఏదో వాగేస్తున్నాను. ఇంతకీ మీరేం చేస్తున్నారో. మీవారేంచేస్తున్నారో చెప్పారు కాదు." అన్నాను.

"నేను ఫైనలియర్ ఫిలాసఫీ ఆనర్స్. మావారు బొంబాయిలో రిసెర్చి చేస్తున్నారు." ఆమె పెదవుల

మీది పరిహాస పూర్వకమైన దరహాసం మళ్ళీ నన్ను కొంచెం బాధించింది.

"మీరు చదువుకున్నందుకు సార్థకత సంపాదించారు. నిజంగా నన్ను నిస్సంకోచంగా మర్యాద చెయ్యగల శిక్షణ మీ రెక్కడ పొందినా చాలా గొప్పదే నంటాను. చదువుకున్న వాళ్ళ నెందర్నో చూశానుగాని మీ శిక్షణ ఎక్కడా కనబడలేదు."

"ఏదో అనవసరంగా పొగిడేస్తున్నారు. కాని మీరుమాత్రం తక్కువా. ఇది పరస్పరమైనది. అందుకు ఎవరం ఎవర్నీ అభినందించుకో నక్కరలేదు. అయినా యీమాత్రపు మర్యాద తెలియకపోతే నే విచారించాలి. ఇక సంకోచం మాటంటారా; జీవితంలో లక్ష అనుకోని సంఘటనల నెదుర్కోవలసి వస్తుంది. ఎందరి సహాయమో పొందవలసివస్తుంది. అడుగడుగునా సంకోచం పెట్టుకుని కూర్చుంటే ఎల్లా కుదురుతుంది చెప్పండి. పోనీ యివాళ విషయమే తీసుకోండి. సంకోచం పెట్టుకుని కూర్చుంటే కంపెనీ లేక ఎంత బోరింగ్ గా ఉండిఉండేదో చూడండి!" అంది. అదే నిర్మలమైన నవ్వు.

"ఇవాళ మఘుకోసం నేనుకూడ మానుకోక పోవడం నిజంగా నా అదృష్టమే. మీ పరిచయం కావడం చాలా ఆనందంగా ఉంది." అన్నాను.

"మీరు మళ్లీ పొరపడుతున్నారు. నా మైత్రిలో ప్రత్యేకత ఏమీ లేదు. అంత దుర్లభమైనదీ కాదు. పరిచయం గొప్పేంకాదు. ఇక్కడ యివాళ విధి. ఇందులో ఉపయోగం యిద్దరిదీను. ఇల్లా జరక్క పోతే నే అసహజంగా, విసుగుగా గడిచిఉండును." అంది కల్పన.

"మీ కభ్యంతరం లేకపోతే నేనొక్క సిగరెట్టు కాల్చుకుంటాను." అన్నాను నవ్వుతూ.

"మీరు బలే మాట్లాడతారు. మీరు సిగరెట్టు కాల్చుకుంటానంటే నాదేం అభ్యంతరం? అదీ కాక అభ్యంతర పెట్టడానికి నాకే మధికారం ఉంది?"

"అల్లా అనకండి. సభ్యత అనేది ఒకటిఉంటుందని మీకు తెలీదు? అది అడ్డంవస్తుందని గ్రహించండి. నిజంగా మీరు వద్దంటే నేనా సభ్యతకోసమైనా విధిగా మానేస్తాను."

"అయితే తప్పకుండా కాల్చుకోండి. అయితే పొగమాత్రం యిటు వదిలే ప్రయత్నం చెయ్యకండి."

"అంత దుర్మార్గుణ్ణి కాదులెండి." అంటూ సిగరెట్ ముట్టించాను.

రెండింటిదాక ఏవో బాతాఖానీ వేసి మళ్ళీ బయలుదేరాం. ఆ మిగిలిన ఖాద్యవస్తువులు అక్కడి వాళ్ళకి పంచి ఖాళీ డొక్కులు మోయించుకుని బయలుదేరింది ఆమె.

అక్కడికి అరమైలుంటుంది ఆ ఏడురథాలు ఉండే ప్రాంతం. లైట్ హౌస్ ఉన్న కొండ దిగిపోతే యీ రోడ్డుకివచ్చి కలుస్తుంది. కార్లు పోయేదానికికూడ మార్గం ఉంది. రెండుకార్లెందుకని ఆమె కారులో నే బయలుదేరాం.

చెట్లూ, చామలూ మధ్యన రాతిలో చపటా చేసినట్టుంది. అక్కడే ఉన్నాయి రథాలు. గుడి గోపురాలలాగ ఉన్నాయి. వన్నెలు చిన్నెల చెక్కడాలున్నాయి. శిల్పచతురిమ మెచ్చతగినది. అవికూడ ఏకశిలాఖండాలే. ఏడూ ఉన్నాయా అని లెక్క పెట్టకపోవడం నాదో చిన్న పొరపాటు. ఏ మేడ ఎక్కినా ఎన్ని మెట్లు ఎక్కానో లెక్క పెట్టాలనుకుంటాను. తీరా, ఎక్కేంతరవాతో, దిగింతరవాతో జ్ఞాపకం వస్తుందావిషయం. ఆ రథాలు కూడా పాండవులకాలం వేనట. అక్కడ దృష్టి నాకర్షించేది ఏనుగు నిలబడిఉన్నట్టున్న చెక్కడం. అది అచ్చం ఏనుగు నిలబడ్డట్టే ఉంటుంది దూరాన్నించి చూస్తే.

మామల్లపురం వెళ్లాలంటే మళ్ళీ వెనక్కి వచ్చి ఊళ్లోంచే వెళ్లాలి. ఆ హోటళ్ళు అవీ ఉన్న అడ్డ రోడ్డంట ముందుకు వెళ్లాలి. సుమారు ఒక మైలుంటుంది. సముద్రపుటొడ్డునే ఉంది దేవళం.

అక్కడ మామల్లపురం అనే ఊరుండేదని, సముద్రం చొచ్చుకునిరావడంచేత అంతమైపోయిందని చెప్పాడు గైడ్. సముద్రంలో అరమైలువరకు అట్టే లోతు లేదట. అక్కడికి వెడితే జలాంతస్థితమైన శిల్పాలింకా కొన్ని చూడవచ్చునట. ఏదో దేవాలయం తాలూకు నందివిగ్రహాలు విడతీయబడి ఆ గుడి ముందు పేర్చబడి ఉన్నాయి. పై ప్రాకారంచుట్టు తిరిగి వెడితే వెనకవైపు రాతిద్వారంలోనించి సముద్రం కనబడుతుంది. అక్కడనించి కిందికి నిటారుగా దిగితే సముద్రపుటొడ్డు ఒరుసుకొనిపోకుండా కట్టిన కట్టమీదకి దిగుతాం. కెరటాలు పైకిలేచి నీళ్ళు

చింది యీ గట్టుమీద పడతాయి. దేవాలయం ప్రక్కల నించి రాతిమెట్లు దిగి అక్కడికి చేరుకోవచ్చు. గుడిలో చీకటికోణపు గుహలాంటిది ఒకటి ఉంది. లాంతరు తీసుకునితప్ప లోపలికి అడుగు పెట్టలేం. లోపల ఎత్తు తక్కువే విశాలం తక్కువే. పాండురంగని విగ్రహం ఒకటి వెల్లకిల పరుండబెట్టిన స్థితిలో ఉంది. వంగి దీపం పెట్టి చూడాలి విగ్రహాన్ని. పొడవుపాటి విగ్రహం అది.

జీవితంలో మహాబలిపురం పేరు చెప్పుకుని మరువలేని దృశ్యం అక్కడి సముద్రం. కడలి చొచ్చుకుని వచ్చేయడం చేత సిమెంటు దిమ్మలతో ఎత్తుగా కట్టారు. ఉవ్వెత్తుగా లేచే కెరటాలు చిన్న చిన్న రాళ్ళగుట్టలకు కొట్టుకుని పది పదిహేను అడుగుల ఎత్తులేచి పైకిచిమ్మి తెల్లని నురుగు పువ్వులులా రాలుస్తూ ఆ రాళ్ళని అభిషేకంచేసే దృశ్యం హృద్యంగా హృదయాంతరాళాల్లో ఉరకలు వేస్తూ ఉంటుంది. ఎదురుగుండా అపార జలరాశి. రెండు ప్రక్కలా పరిచినట్టు అంతులేకుండా చూసినంత మేర యిసుక. యిసుక వెనకాల సరుగుడుచెట్ల వనాలు. దూరాన కొండలు. ఎంతో పెద్దపెద్దరాళ్ళు జలాల తాకిడికి విచ్ఛిన్నమై, కొండలు బండలై, రాళ్ళై యిసుక రేణువులైపోయాయి. ఆ యిసుక, అవస్థకు చేరుకోని రాళ్ళు వివిధాకారాలతో వివిధ పరిమాణాలవి గుట్టలు గుట్టలుగా యింకా జలాలతో ఆడుకుంటున్నాయి. ఏ యంత్రాలు, పనిముట్లు ఉపయోగించి ఎంత జాగ్రత్తగా మలచినా రానంత నునుపుగా ఉన్న రాళ్ళు సహజంగా పడిఉన్నాయక్కడ. ఒక్కొక్క కెరటమే వచ్చి రాళ్ళతో పేచీపడి ఎత్తెగిరి బాణాలు కురిపించినట్టు సన్నని నీటితుంపరలు కురిపిస్తోంది. ఆ సముద్రపు అందమే వర్ణించగలిగితే లేందేముంది?

మైమరచి రెండుగంటలా యిసుకలో కూర్చున్నాం. ఎండగానేఉంది పైన. అయినా అది తన ప్రభావం ఏమాత్రమూ మామీద ప్రసర్శించలేకపోయింది. అది మా యిద్దరి గొప్పేం కాదు. అల్లా ఎంతని లెక్క చెయ్యకుండా కూర్చున్న వాళ్ళు చాలా మంది ఉన్నారక్కడ. అసలు అక్కడికి వచ్చినవాళ్ళెవరు వళ్ళు మర్చిపోకుండా ఉండగలరు? రెండు గంటలూ ఒక్కమాటైనా మాట్లాడలే దిద్దరమూ.

ఎంతసేపు కూర్చున్నా తనివితీరేటట్టు లేదు. వెళ్ళక తప్పదుగా. అందుకని మనసు కట్టుకుని లేచి కార్లదగ్గిరకి చేరుకున్నాం. ఫ్లాస్కులో మిగిలిన కాఫీ తాగుతూండగా అంది కల్పన.

“వచ్చినదారే ఎందుకు చెంగల్పట్ దారిన పోదాం. ఇరవైమైళ్ళేగా ఎక్కువ. ఏమంటారు?”

“సరే. దానికేం దారిలో పక్షితీర్థంకూడ తగులుతుంది. దిగి చూడకపోయినా కొండయినా కనబడుతుంది.”

సాధారణంగా మహాబలిపురం రాదల్చుకున్న వాళ్ళలో దైవభక్తి మిక్కుటమైనవాళ్ళుంటే పొద్దున్నే బయలుదేరి పక్షితీర్థం చూసుకుని మరీవస్తారిక్కడికి. మధ్యాహ్నం పన్నెండుగంటలకో ఎంతకో పక్షులొచ్చి ప్రసాదం సేవిస్తాయట. ఆ దృశ్యం చూసి యిటు బయలుదేరి యిక్కడ చూసినెళ్ళేటప్పుడు మేం వచ్చిన దారిన వెడతారుట. కాని మాది దానికి వ్యతిరేకమైన పద్ధతి. దేముడిమీదకంటె ప్రసాదంమీద ఎక్కువ భక్తిగలవారి వర్గం మాది.

బయలుదేరాం. చక్కని రోడ్లు. వచ్చేదారి అంత బాగుండదు. ఇదంతా తారురోడ్డు. చిన్న చిన్న పల్లెలు గడుస్తున్నాయి. తొందరగానే పోతున్నాయ్ కార్లు. మనవైపు రోడ్లతో పోల్చి చూశాను యీరోడ్లని. వాటితో పోలిస్తే ఎంత బాగున్నాయ్ యీ రోడ్లు. సాఫీగా సాగిపోతున్నాయ్ కార్లు. ఎల్లాగయినా తమిళుల తెలివి మెచ్చతగినది. ఉభయ మద్రాస్ రాష్ట్రంలో ఎంత బాగుపడ్డారు?

పక్షితీర్థం ఊళ్ళోంచి పోతున్నాం. రోడ్డు మీదకే ఉన్నాయ్ మెట్లు. పైన దేవాలయం. తరువాత చెంగల్పట్టు. మరీ పెద్దది కాకపోయినా తీరుగా ఉంది ఊరు. కొండల మధ్యనుంచి రోడ్డు మీదా, రైలు పట్టాల పక్కనా రైలుని తప్పించీ, ఊళ్ళకి ఊళ్ళు దాటాం. తాంబరం శానిటోరియం, క్రోంపేట యం. ఐ టి. గిండీ, నరుసుస్టుడియో అన్నీ వరుసగా గడిచిపోయాయ్.

మైలాపూర్‌లో కల్పనని యింటిదగ్గర విడిచాను.

“రేపు ఆదివారం తప్పకుండా వస్తారు కదూ? మా నాన్నగార్ని పరిచయం చేస్తాను. మరచిపోకండేం?” అంది గేటు దగ్గర భరత వాక్యం పలుకుతూ, కల్పన.

“తప్పకుండా వస్తాను.”

అంటూ గుడ్ బైకొట్టి వర్క్‌షాప్‌కి దారి తీశాను. కారు అప్పజెప్పి బస్‌మీద బయలుదేరాను టి. నగర్.

మర్నాడు మధుకి నివేదించాను అన్నీను.

“పెద్ద గొప్పలు పోయావు పోనుపోనని. అందుకనే ఎవరికెప్పుడు వీలైతే అప్పుడు పోవాలంటాను నేను. మనిద్దరం కలిసి యింకో రోజున పోదాంలే. మొత్తానికి థాన్క్స్. కంగ్రాట్స్.” అన్నాడు వేళాకోళంగా నవ్వుతూ.

"ఏమిటి ఛాన్స్. నీ మొహం. రేపు ఆదివారం కాఫీనూ, వాళ్ల నాన్నవరో వారి పరిచయమూను. అంతేనా?" అన్నాను వాడి ధోరణి నచ్చక.

"ఏమో ముందేముందో." అన్నాడు ఎస్ట్రాలజర్‌లా పోజు పెట్టి.

ఆదివారం సాయంకాలం అయిదు గంటలకు వెళ్లాను వాళ్లింటికి. కల్పనా, వాళ్ల నాన్నగారు నా కోసం ఎదురు చూస్తున్నారు. పరిచయ వాక్యాలయిన తరువాత వాళ్లమ్మాయిని పడిపోకుండా కాపాడినందుకు కనేక విధాల కృతజ్ఞత వెల్లడించాడు. మనిషి బలే సరదా అయినవాడు. ప్రతీది యీజీగా తీసుకోగల సామర్థ్యం గలవాడు.

మాటల సందర్భంలో మా కుటుంబం సంగతీ నాన్నగారి ప్రసక్తి వచ్చింది.

"ఎవరూ?" అన్నారాయన నాన్నగారి పేరు విని.

చెప్పాను. ఆయన ఆశ్చర్యానికంతు లేదు.

"వాడి కొడుకువా! ఎంత వాడివయ్యావ్! ఇంతప్పుడు చూశాను నిన్ను. మా యింట్లో మీ నాన్నని గురించి అస్తమానం తల్చుకుంటూనే ఉంటాం" అంటూ నన్నెగాదిగా పరిశీలించాడు ఆయన.

నాకు మతిపోయింది. కల్పన ఒకసారి కళ్ళెత్తి చూసి కాఫీ కలపడంలో మునిగిపోయింది.

"అలా ఆశ్చర్యపడతావ్ మీ నాన్ననోట నా పేరెప్పుడూ వినలేదుటోయ్. రాజారావని ఎప్పుడూ ......" అన్నాడు.

రాజారావుగారా ? యీయనా ? కల్పనని అయితే నేనెప్పుడో ఎరిగి ఉండవలసినదన్నమాట. నాన్నగారి ప్రాణస్నేహితుడు!

"వినకేం. నాన్నగారినోట చాలాసార్లు విన్నాను. కాని వారు పోయే పదేళ్ళయింది కదండి మీ విషయం జ్ఞాపకం లేదు క్షమించండి. లేకపోతే యీ వూళ్లోనే ఉంటూ నాలుగేళ్ళలో ఒక్కసారీ రాకపోతానా." అన్నాను సంతాపం వెలిబుచ్చుతూ.

"మీ నాన్న పోయింతరువాత మీ విషయా లేం తెలియలేదు నాకు. పోనీ ఏకోవిధంగా పూర్వ పరిచయం తెలిసింది." అంటూ ఎంతో సంతోషించాడు.

నాన్నగారి ప్రస్తావన కొంతసేపైనతరువాత నన్ను గురించి అంతా అడిగి తెలుసుకుని ఆనందించాడు నేనింతవాడినైనందుకు.

"మీ అల్లుడుగారెప్పుడు వస్తారీమధ్య ? వారి పరిచయంకూడ చేసుకోవాలనుంది." అన్నాను మాటల సందర్భంలో.

"ఎవరూ? అల్లుడా?" మూర్ఛ వచ్చినంత పనైంది ఆయనకి. కల్పన ముఖం రంగులు మార్చుకుంది.

మళ్ళీ వివరించి చెప్పాను.

"అందీ! అల్లాగే అందీ! మా బాగా టోపీ వేసింది నీకు. మ...హా...బా...గా" అంటూ నవ్వుతూ దొర్లిపోయి కాఫీ అంతా టేబుల్‌మీద తిరగబోసేశాడు.

కల్పన లోనికి పరిగెత్తింది.

రెండోసారి ఫూల్‌నయ్యాను నేను.

అది మొదలు మా పరిచయం అభివృద్ధి పొందింది. పరిణామం మీకే తెలుసు. మధుగాడి జోస్యం కరెక్ట్ అయి కూర్చుంది.

కల్పన తన చాతుర్యాన్ని గురించి నన్నెలా ఫూల్ చేసిందీ అస్తమానం నాకు జ్ఞాపకం చేస్తూండేది. కాని నేన మెకాట కొంతకాలం సాగనిచ్చాను.

ఒక రోజున ఏదో ప్రసక్తిమీద మళ్లీ ఆ విషయం ఎత్తింది. నాకింక ఉండబట్టలేదు. ఊరుకుంటే లాభం లేదు అమ్మాయి పొగరణచాలంటే చెప్పెయ్య వలసిందే అనుకున్నాను.

"ఇదుగో అమ్మాయ్ రహస్యం ఒకటి చెప్పనా?" అన్నాను.

"ఏం. అబ్బాయ్. ఏమిటమ్మా అది" అంది వేళాకోళంగా.

"అవాళ మహాబలిపురం వెళ్లే దారిలో ఫ్లాట్ టైర్ కానేలేదు. నిన్నేడిపించాలనే అల్లా చేశాను. అప్పుడు చూడవలసిందండీ అమ్మాయిని."

"ఆఁ!" అంటూ తెరిచిన నోరు తెరిచినట్టే ఉంచేసింది.

కొంత సేపటికి తేరుకుని—

"అయితే నాదగ్గర జాకీ తీసుకుని టైర్ మార్చడం అంతా హంబగ్గే?"

"ఖర్మ కాలి చచ్చినట్టు ఏమీ లేకపోయినా అన్నీ మెడకు చుట్ట బెట్టుకుని నానాబాధా పడ్డాను."

"మా బాగా అయింది. పాపం లేకపోతే నన్నేడిపించి ఊరికే పోదామనుకున్నావా. అహహాఁ మిసెస్ కల్పనా రావ్ అనగానే మూడాలి అబ్బాయి మొహం ఎల్లా ఉందో. అబ్బ! ఏం మొహమోయ్ అది!" అంటూ నవ్వుతూ దొర్లిపోయింది.